క్లుప్తంగా

పరిషత్ ఎన్నికలకు సిద్ధంకండి



అధికారులకు సూచనలిస్తున్న వెంకటేశ్వర్లు

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రంలో జరగబోయే జిల్లా, మండల పరిషత్ ఎన్నికల కోసం పోలింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఐఓసీ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓలు మోహన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కులాల వారీ సర్వేపై కసరత్తు



ఓటర్ల సంఖ్యను లెక్కిస్తున్న కార్యదర్శులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అన్ని గ్రామాల్లో కులాల వారీ సర్వేపై గురువారం పంచాయతీ కార్యదర్శులు కసరత్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు కులాల వారీ ఓటర్ల సంఖ్యలను లెక్కించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో ఏ కులాల ఓటర్లు ఎంత మంది ఉన్నారో లెక్కిస్తున్నామన్నారు.

ఆధార్ సెంటర్ పరిశీలన

దౌల్తాబాద్(దుబ్బాక): జిల్లా పరిషత్ పాఠశాలలోని ఆధార్ సెంటర్‌ను మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు గురువారం సందర్శించారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు విద్యార్థుల సౌలభ్యం కోసం, విద్యార్థుల ఆధార్ కార్డులలోని వాలిడేషన్, సవరణలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్ రెడ్డి, ఆపరేటర్ ఆనంద్, సీఆర్‌పీ రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

బీఎస్పీ కేంద్ర కోఆర్డినేటర్‌గా రామచంద్రం



రామచంద్రం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌కు చెందిన నిశాని రామచంద్రాన్ని బీఎస్పీ కేంద్ర కోఆర్డినేటర్‌గా నియమించినట్టు ఆ పార్టీ అధినేత మాయావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తేదీన న్యూ ఢిల్లీలోని మాయావతి నివాసంలో ఈ ప్రకటన జారీ చేశారు. ఇరవై యేళ్లుగా వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయనకు ఈ పదవి నివ్వడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాక్టరు అపహరణ

కొండపాక(గజ్వేల్): వ్యవసాయ బావి వద్ద ఉంచిన ట్రాక్టరు చోరీకి గురైంది. ఈ ఘటన మండలంలోని రాంపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొమ్మ నర్సింహులు వ్యవసాయ పనులు ముగించాక బుధవారం రాత్రి ట్రాక్టరు, ట్రాలీని వేర్వేరు చోట్ల ఉంచాడు. మరుసటి రోజు బావి వద్దకు వెళ్లే సరికి ట్రాక్టరు, ట్రాలీ కనిపించలేదు. దీంతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సరోజినీ నాయుడి కృషి మరువలేనిది: హెచ్‌ఎం

మద్దూరు(హుస్నాబాద్): ఆంగ్ల భాషాభివృద్ధికి సరోజినీనాయుడు చేసిన కృషి వెలకట్టలేనిదని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేబర్తి ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రభాను అన్నారు. తెలంగాణ ఆంగ్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ సరోజినీ నాయుడు తన కవితలు, రచనలతో రాణించారన్నారు. అందువల్లే భారత ప్రభుత్వం కవి కోకిల బిరుదు ద్వారా సత్కరించిందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్ కుమార్, చంద్రారెడ్డి, రవి, మల్లేశం, నర్సింహులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మునిపల్లి(అందోల్): చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల నాయకులు రమేశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రామసేన పేరుతో వచ్చి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నగేశ్, నర్సింహులు, గోవింద్ పాల్గొన్నారు.

ఆ గ్రామాల విలీనం వద్దు

- ప్రశ్నార్థకంగా అక్కన్నపేట మండలం
- హుస్నాబాద్‌లో 15 గ్రామాలు?
- ఆందోళనలో ప్రజలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో సుమారు 15 గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనం చేయనున్నట్లు చర్చ జరుగుతుండటంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. 2016లో పరిపాలన సౌలభ్యం కోసం అక్కన్నపేట మండలం ఏర్పాటైంది. అసెంబ్లీ ఎన్నికల ముందు గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, జనగామ, గౌరవెల్లి, బొడిగెపల్లి, గుబ్బడి, మంచినీళ్లబండ, కేశవాపూర్, గుడాటిపల్లి గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం కానున్నట్లు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే.

విరమించుకోవాలి..

ఈ నేపథ్యంలో మండలంలోని ధర్మారం, పోతారం (జే), నందారం, కపూర్‌నాయక్‌తండా, మసిరెడ్డితండా గ్రామాలను కూడా హుస్నాబాద్‌లో విలీనం చేసేందుకు ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. దీంతో కొత్తగా విలీనం చేయాలన్న గ్రామాల ఆలోచనను విరమించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దూరాభారం

ధర్మారం, పోతారం(జే), నందారం, కపూర్‌నాయక్‌తండా, మసిరెడ్డితండా గ్రామాలు మండల కేంద్రానికి ఇంచుమించు తొమ్మిది, పది కిలో మీటర్ల పరిధిలోనే ఉంటాయి. అదే హుస్నాబాద్ కేంద్రానికి ఒక్కొక్క గ్రామానికి సుమారు 18 నుంచి 21 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అదేవిధంగా రవాణా సౌకర్యం కూడా సరిగా లేదు. హుస్నాబాద్‌కు రావాలంటే ఈ గ్రామాల ప్రజలు సేవాలాల్ మహరాజ్ తండా నుంచి కుందనవానిపల్లి మీదుగా వెళ్లవల్సి ఉంటుంది. అలాగే అక్కన్నపేట మండలానికి వెళ్లాలన్నా కుందనవానిపల్లి మీదుగానే పోవల్సి ఉంది. కుందనవానిపల్లి నుంచి అక్కన్నపేట మండలానికి దాదాపు 2 నుంచి 3కిలో మీటర్ల దూరం ఉంటుంది.

ప్రశ్నార్థకంగా అక్కన్నపేట మండలం

ప్రస్తుతం మండలంలో 37 గ్రామాలు ఉండగా అందులో పాత ప్రాథమిక గెజిట్ ప్రకారంగా 10 గ్రామాలు హుస్నాబాద్ మండలంలో విలీనం కానున్నాయి. అలాగే మరో 5 గ్రామాలను కూడా విలీనం చేయాలని సరిగ్గా వారం రోజుల కిందట ప్రతిపాదనలు పంపించారన్న సమాచారంతో ప్రజలు తీవ్రమైన అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా విలీనం అయితే మండలంలో 22 గ్రామాలే మిగులుతాయన్న చర్చకూడా సాగుతోంది. ఏది ఏమైనా స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిసారించి గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి విలీనంపై ఆలోచించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అక్కన్నపేట మండలంలోని ధర్మారం గ్రామం

మా గ్రామాన్ని విలీనం చేయొద్దు



కపూర్‌నాయక్‌తండా గ్రామాన్ని అక్కన్నపేట మండలంలోనే కొనసాగించాలి. ఎట్టి పరిస్థితిల్లో హుస్నాబాద్‌లో విలీనం చేయొద్దు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా గ్రామాలను విలీనం చేయడం సరైంది కాదు. విలీనంచేసే ఆలోచనను విరమించుకోవాలి.

– భానోతు సంతోష్‌నాయక్, మాజీ సర్పంచ్, కపూర్‌నాయక్

మాకు ఎలాంటి సమాచారం రాలేదు



మండలంలోని గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేసినట్లు మాకైతే ఎలాంటి సమాచారం రాలేదు. ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాలు సైతం చేసి ప్రభుత్వానికి నివేదికలను పంపించాం. ప్రజాభిప్రాయం మేరకే విలీనం సాధ్యమవుతుంది.

– జయరాం, ఎంపీడీఓ అక్కన్నపేట

‘ప్రయివేటు’కు పంచాయతీ ట్యాంకర్

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు పచ్చగా ఉండడానికి హరిత హారం, పరిశుభ్రంగా ఉండడానికి చెత్తను డంపింగ్ షెడ్డుకు తలలించడానికి ప్రతి పంచాయతీకి ఒక్కో ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్‌ను కొనుగోలు చేసింది. దీనిని కొంత మంది పంచాయతీ కార్యదర్శులు ఆసరాగా చేసుకుని ట్యాంకర్‌తో నీటిని ప్రయివేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నారు. దీనిని పర్యవేక్షించవలసిన అధికారులు పట్టించుకోక పోవడంతో కార్యదర్శుల ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కిష్టంపేట శివారులో వల్లెపు వెంకటేశ్ కొద్దిరోజులుగా నూతన గృహనిర్మాణం పనులు చేపట్టాడు. దానికి గురువారం పంచాయతీ ట్యాంకర్‌తో నీరు సరఫరా చేయడంతో గ్రామస్తులు మండిపడ్డారు. గతంలో కూడా పంచాయతీ ట్రాక్టర్ ఇతరుల పొలం పనుల కోసం ఉపయోగించారని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు చేపట్టాలని కోరారు.



నూతన గృహనిర్మాణానికి నీరు సరఫరా చేస్తున్న పంచాయతీ ట్యాంకర్

‘యూపీఎస్’తో మరింత దుర్భరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగులు ఉద్యమాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ తేవడంలో అర్థం లేదని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ విమర్శించారు. హుస్నాబాద్‌లో మార్చి 2న ధర్నా చౌక్ వద్ద నిర్వహించే యుద్ధభేరి పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ పెన్షన్‌తోనే ఉద్యోగులకు నష్టం జరుగుతుందని, ఉద్యమాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానంతో ఉద్యోగుల జీవితాలు మరింత దుర్భరం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే నెల 2న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద ఉద్యోగులు చేపట్టే యుద్ధభేరిని ఉద్యోగులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, మల్లికార్జున్, శౌయాదవ్, బండారి ఎల్లయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ మృతదేహానికి నివాళులు

– రూ.30వేలు సహాయం



గౌరవ వందనం చేస్తున్న సీఐ శ్రీను, ఎస్‌ఐ నీరేశ్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఓ మహిళా కానిస్టేబుల్ స్వప్న మృతదేహానికి చేర్యాల పోలీసులు నివాళులర్పించారు. గురువారం ఆమె స్వగ్రామమైన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లికి వెళ్లిన సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ పి.నీరేశ్, సిబ్బంది స్వప్న మృతదేహంపై పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ యువ మహిళా కానిస్టేబుల్‌ను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. సీపీ బి.అనురాధ కూడా కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. డిపార్ట్‌మెంట్ తరపున రావలసిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే అందేలా చూస్తామని తెలిపారు. అంత్యక్రియలకు ప్రభుత్వం తరపున ఇచ్చే రూ.30వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

– ఏడీఏ పద్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్, పొద్దుతిరుగుడు సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ పద్మ అన్నారు. గురువారం చిన్నకోడూరు, మెట్‌పల్లి గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్, పొద్దు తిరుగుడు, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పొద్దుతిరుగుడు దిగుబడి పెరగడంలో విత్తన ఎంపిక, విత్తే పద్ధతి, దూరం, ఎరువులు, నీటి యాజమాన్యం, తాలు గింజలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయిల్‌పామ్ సాగులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల ఫిర్యాదు

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలం కమలాయపల్లికి చెందిన వగలరాయిని చెరువు శిఖం భూమిని తన సొంతానికి వాడుకుంటూ వ్యవసాయం చేస్తున్న చిట్యాల గ్రామానికి చెందిన వంకాయల కనకయ్యపై చర్యలు తీసుకోవాలని గొల్లకురుమ కాపర్లు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో సైతం చెరువు నిండకుండా శిఖం భూమిని వాడుకుంటూ అనుభవిస్తున్నాడన్నారు. శిఖంలో ఉన్న చెట్లను సైతం నరికివేసి వ్యవసాయం చేస్తున్నాడని ఆ చెట్లు ఉండడం వల్ల తాము పెంచుకున్న జీవాలకు ఆహారం దొరకకుండా చేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చెడు వ్యసనాలతో భవిష్యత్ అంధకారం

నంగునూరు(సిద్దిపేట): చదువుకునే వయసులో చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారం అవుతుందని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసిఫ్ అన్నారు. గురువారం నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు నిబంధనలు, ప్రమాదాలు, మహిళల కోసం ఉన్న చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏఎస్‌ఐ కిషన్, మమత, ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణానికి కృషిచేయాలి

హుస్నాబాద్‌రూరల్: యువత చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఏర్పడడానికి కృషిచేయాలని ఎస్‌ఐ మహేశ్ సూచించారు. గురువారం రాత్రి పందిల్ల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా పార్టీల నాయకులు పగలు, ప్రతీకారాలు పెంచుకోవద్దన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఆసిఫ్

బూస్టర్ మోటార్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



బూస్టర్ మోటార్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బూస్టర్ మోటార్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను భగీరథ అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. మండలంలోని కెప్టెన్ చౌడుతండా, మైసమ్మవాగుతండాల్లో బూస్టర్ మోటార్లకు ట్రాన్స్‌ఫార్మర్లను బిగించారు. రెండు రోజుల కిందట కెప్టెన్ చౌడుతండాలో బూస్టర్ మోటార్ వద్ద ఉన్న విద్యుత్ వైర్లు తొలగించడంతో తాగునీరు సమస్య తలెత్తింది. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిసారించి బూస్టర్ మోటార్ల వద్ద ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ పట్టభద్రులకు రూ.4వేల భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు సూచించారు. హుస్నాబాద్‌లో గురువారం జరిగిన బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పినట్లుగానే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించడానికి పట్టభద్రులను చైతన్యం చేయాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, శంకర్‌బాబు, శ్రీనివాస్, సతీశ్, విద్యాసాగర్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

క్రీడల ద్వారా స్నేహభావం



క్రీడాకారులతో బీఆర్‌ఎస్ నాయకులు

- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడల ద్వారా స్నేహభావం పెంపొందుతుంది బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని మండల స్థాయి వాలీబాల్ క్రీడలను గురువారం చిన్నకోడూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యం, మంచి అలవాట్లకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. నేటి సాంకేతిక, సోషల్ మీడియాతో విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి లేకుండా పోతుందన్నారు. విద్యార్థులకు చదువు ఎంతనో క్రీడలు అంతే ముఖ్యమన్నారు. క్రీడల ద్వారా స్నేహభావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మండల సమన్వయకర్త పాల సాయిరాం, నాయకులు కాముని శ్రీనివాస్, ఉమేశ్ చంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- ఆరుబయట చెత్త వేయొద్దు
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



మహిళతో మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: కరీంనగర్ జిల్లా నుంచి పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి ఎంతో కష్టపడి తెస్తున్న మానేరు నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. గురువారం ఆయన పలు వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్ళి తాగునీటి సరఫరా ప్రక్రియ, నీటి సమయపాలన తదితర అంశాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొందరు మున్సిపల్ నల్లా నీటిని వృథా చేయడాన్ని గమనించి వారికి అవగాహన కల్పించారు. తాగునీరు వేసవిలో చాలా ముఖ్యమని, ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా చెత్తను మున్సిపల్ వాహన సిబ్బందికి అందజేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలో ఒక మహిళ ఇంటి పరిసరాల్లో చెత్త కాల్చడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పదో వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వార్డు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ఇంటి నిర్మాణం ఉండడం గమనించారు. వెంటనే ఆ నిర్మాణ పనులను ఆపాలని ఆదేశించారు. విక్రయించే మాంసంపై మున్సిపల్ ముద్ర లేకపోవడంతో జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట కౌన్సిలర్లు లక్ష్మణ్ రాజేశం, అధికారులు దేవరాజ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మంద కృష్ణ మాదిగకు అభినందనలు

దౌల్తాబాద్(దుబ్బాక): మందకృష్ణ మాదిగతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షుడు సింహాచలం అన్నారు. దళిత ఉద్యమాల ధీరుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణను గురువారం సత్కరించారు. కార్యక్రమంలో దొమ్మాట మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, కనకయ్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల సేకరణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో ఏర్పాటు చేయనున్న శ్రీశక్తి సోలార్ ప్లాంట్ కోసం స్థలాన్ని సేకరిస్తున్నట్లు సంస్థ మండల ఇన్‌చార్జి ఉదయ్ కుమార్ తెలిపారు. మండలంలోని దాచారంలో గురువారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లకు కి.మీ పరిధిలోని వ్యవసాయ భూములు కల రైతులు తమ భూములను లీజుకు ఇవ్వాలని ఆయన కోరారు. ఎకరాకు ప్రతి యేడాదికి రూ.33 వేలు కౌలు ఇస్తామని చెప్పారు.

◆ బోధనలు మార్గదర్శకాలు



బెజ్జంకి(సిద్దిపేట): గురువుల బోధనలు మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని కోరుట్ల ఆశ్రమ వ్యవస్థాపకుడు జగదీశ్వరానంద స్వామి ఉద్బోధించారు. మండలంలోని గాగిళ్లాపూర్‌లోని ధ్యాననిష్ఠాశ్రమ వ్యవస్థాపకుడు శ్రీసద్గురు దయానంద స్వామి 104వ జయంతి, 66వ ఆశ్రమ వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక జ్ఞానం, సత్యం, ధర్మం, శాంతి జీవితంలో సవాళ్లను ఎదుర్కొనే ధైర్యాన్నిస్తుందన్నారు. అనంతరం దయానందస్వామి శ్వేత విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం, తిరుపతిరెడ్డి, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

◆ మోతెలో వర్గ విభేదాలు లేవు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని గ్రామస్తులు తీర్మానించారు. ఇటీవల గ్రామంలో వరుసగా జరుగుతున్న మరణాలపై వస్తున్న అపోహలను నివృత్తి చేసుకోవడానికి గురువారం గ్రామస్తులు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో మూఢవిశ్వాసాలకు తావు లేదని, గ్రామస్తులమంతా ఐక్యంగా ఉంటామన్నారు. శ్రీవేంకటేశ్వ స్వామి ఆలయం ఎదుట ఉన్న కోనేరు బావిని పునర్నిర్మించడంతో పాటు, గ్రామంలో బొడ్రాయిని ఏర్పాటు చేయుటకు గ్రామస్తులు తీర్మానించారు.

◆ పోలీసుల ‘కనువిప్పు’

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాల్లో ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. సీపీ ఆదేశాల మేరకు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో బుధవారం రాత్రి పోలీసులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో జరుగుతున్న వరుస మృతుల ఘటనలపైనే కాకుండా మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. అనారోగ్యంతో చనిపోయారే తప్ప మంత్రాలు తంత్రాలతో కాదని, మూఢనమ్మకాలతో ఒకరికొకరు మోసం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ తోపాటు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ అహిల్యాబాయి విగ్రహ ఏర్పాటుకు వినతి

గజ్వేల్‌రూరల్: ధీర వనిత అహిల్యాబాయి హోల్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు అధికారులకు విన్నవించారు. పట్టణంలోని క్యాసారం చౌరస్తా వద్ద విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడంపై పట్టణ పౌరులు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా గురువారం కమిషనర్ గోల్కొండ నర్సయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహారాష్ట్రలోని చౌండి అనే గ్రామంలో 1725 మే 31న సామాన్య కుటుంబంలో అహిల్యాబాయి హోల్కర్ జన్మించారని, స్త్రీల సాధికారితకు అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అలాగే వితంతువులకు పునరావాసం కల్పించడం, మహిళా సైనిక దళం ఏర్పాటు వంటి సాహసోపేత నిర్ణయాలతో ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు.

